క్లుప్తంగా

గోవులను పూజించాలి

గండేపల్లి: ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటించి గోవులను పూజించాలని మండలంలోని తాళ్లూరు జీయ్యన్న మఠాధిపతి, భారతీయ ధర్మ పరిషత్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు పోడుగు ప్రసాద్ ఆచార్యులు అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, గో సంతతిని సంరక్షించుకుంటే ధర్మం మనల్ని రక్షిస్తుందన్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం ముండూరు క్షేత్రంలోని యాజ్ఞవల్క్య రాజాశ్రమం 67వ వార్షికోత్సవ వేదాంత మహా సభలు మూడు రోజుల పాటు జరగనున్నాయని తెలిపారు. ఆయన వెం పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి ఉన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు నోటిఫికేషన్

కిర్లంపూడి: ఉపాధి కోసం ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు నోటిఫికేసన్ విడుదలైనట్టు ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 21 నుంచి 50 ఏళ్లున్న అభ్యర్థులు కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఫోన్ నంబరు లింకైన ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వివరించారు. రవాణాకు సంబంధించిన వారు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అర్హులైన వారు వచ్చే నెల పదిలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



ప్రత్తిపాడులో అగ్ని ప్రమాదానికి గురైన ఇల్లు

ప్రత్తిపాడు: తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రత్తిపాడులోని ఓ పెంకుటింట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానిక రాజుగారి వీధిలో రెడ్నం కోటేశ్వరరావు, తోట సురేష్‌కు చెందిన పెంకుటింట్లో ఓ కుటుంబం నివసిస్తోంది. మరో పోర్షన్‌లో ఫొటోఫ్రేమ్ వర్క్స్ షాపు నిర్వహిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో ఫొటోఫ్రేములు, బీరువాలు తదితర సామగ్రి కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎంజీ రత్నరాజు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఫైర్‌మన్లు పి.సూర్యనారాయణ, టి.దుర్గాప్రసాద్, ఇతర సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ఫైర్ ఆఫీసర్ రత్నరాజు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



ప్రత్తిపాడులో ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రత్తిపాడు: ప్రతి ఒక్కరికీ అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి ఎంజీ రత్నరాజు అన్నారు. అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్‌లో ప్రయాణీకులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినపుడు తమకు సమాచారం ఇవ్వడంతో పాటు, చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయాలన్నారు. ఆటో స్టాండ్లు, బస్ కాంప్లెక్స్‌తో పాటు, వివిధ రూట్లలో వెళ్లే బస్సులు, ఆటోల ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఫైర్ సిబ్బంది కేఎస్ఎన్ మూర్తి, కె.వేణు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురి అరెస్టు

47 లీటర్ల సారా స్వాధీనం

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడి, ఒమ్మంగి, వెంకటనగరం పంచాయతీ శివారు తోటపల్లి గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ వివరాల మేరకు, తోటపల్లి గ్రామంలో తెడ్ల గణేష్‌ను పది లీటర్ల సారాతో, ఒమ్మంగిలో 12 లీటర్ల సారాతో నార్లంక వరలక్ష్మిని, చినశంకర్లపూడిలో 25 లీటర్ల సారాతో మానూరి నాగవెంకటదుర్గను అరెస్టు చేశారు. పెదశంకర్లపూడికి చెందిన సారా విక్రేత కోట సూర్యప్రకాశరావుపై పరారీ కేసు నమోదు చేశారు. శంఖవరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముగ్గురిని బైండోవర్ చేసి, శంఖవరం తహసీల్దార్ వద్ద హాజరుపర్చినట్టు ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు. కాకినాడ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక ఆదేశాల మేరకు మన్యం జిల్లా రంపచోడవరం ఎక్సైజ్ పోలీసులతో కలిసి గొంటువానిపాలెం గ్రామంలో క్లస్టర్ రైడ్ నిర్వహించామన్నారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధం చేసిన 1,200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామని తెలిపారు.

రోడ్డు పెరిగేదెలా..!

- మెయిన్ రోడ్డు విస్తరణ కోసం ఎదురుచూపులు
- గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు
- ప్రభుత్వం మారడంతో నిలిచిన పనులు
- పెరిగిన వాహనాలతో ఇబ్బందులు
- ప్రజలకు తప్పని ట్రాఫిక్ కష్టాలు

తుని: ప్రభుత్వాలు మారుతున్నా పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. జనాభాతో పాటు వాహనాల సంఖ్య రెట్టింపయ్యాయి. ఇందుకు అనుగుణంగా రహదారుల సౌకర్యం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కానరావడం లేదు. మున్సిపల్ అధికారులు, పోలీసులు కలిసి ప్రధాన రహదారుల్లో ఆక్రమణలను తొలగించినా.. పరిస్థితిలో మార్పు రాలేదు. ప్రధాన రహదారుల్లో వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. రెండు దశాబ్దాలుగా మెయిన్ రోడ్డు విస్తరణ జరగలేదు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా కృషి ఫలితంగా విస్తరణ పనులకు రూ.54 కోట్ల నిధులు మంజూరయ్యాయి. విస్తరణలో భాగంగా తొలగించాల్సిన భవనాల యాజమానులు కోర్టును ఆశ్రయించడంతో పనులకు అంతరాయం కలిగింది. కొత్త ప్రభుత్వం వచ్చి పది నెలలు అవుతున్నా మెయిన్ రోడ్డు విస్తరణ విషయంలో కనీస శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



తుని గొల్ల అప్పారావు సెంటర్‌లో స్తంభించిన వాహనాల రాకపోకలు

ఇదీ పరిస్థితి

తుని పట్టణ విస్తీర్ణం 7.02 చదరపు కిలోమీటర్లు. జనాభా 54 వేల మంది ఉండగా, 14 వేల కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరిలో ప్రతి కుటుంబానికి వాహనాలున్నాయి. రవాణా శాఖ గణాంకాల ప్రకారం, పట్టణంలో 9 వేల ద్విచక్ర వాహనాలు, 276 కార్లు, 115 భారీ వాహనాలు ఉన్నాయి. ఇవి కాకుండా తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, పాయకరావుపేట, శంఖవరం తదితర మండలాల నుంచి రోజుకు 25 వేల మంది వివిధ పనులపై తుని పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. పదేళ్లలో వాహనాల సంఖ్య రెట్టింపు అయింది. ఇందుకనుగుణంగా రహదారులు ఏర్పాటు కాలేదు. పట్టణంలో ఐదు ప్రధాన రోడ్లు ఉన్నాయి. వీటిలోనే ఎక్కువగా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. జీఎన్‌టీ రోడ్డు, సూరవరం రోడ్డు, ప్రకాశం రోడ్డు, మెయిన్ రోడ్డు, పెంటకోట రోడ్లు కీలకమైనవి. వీటిలో సూరవరం రోడ్డు, ప్రకాశం రోడ్లను విస్తరణ చేశారు. మెయిన్ రోడ్డు, పెంటకోట రోడ్లకు ప్రభుత్వం రూ.54 కోట్లు నిధులు మంజూరు చేసినా పనులు జరగలేదు. ఇందుకు ప్రధాన కారణం స్థల సేకరణకు నష్ట పరిహారం ఎక్కువగా ఉండడంతో, పరిపాలన, సాంకేతికపరమైన సమస్యలున్నాయని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపాం



తుని మెయిన్ రోడ్డు విస్తరణకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం. విస్తరణలో తొలగించే కట్టడాలకు సంబంధించిన యాజమానులతో చర్చలు జరుపుతున్నాం. గతంలో మంజూరు చేసిన రూ.54 కోట్లు ప్రస్తుత ఎస్ఆర్ రేట్ల ప్రకారం సరిపోవు. అదనంగా నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని స్థానిక ఎమ్మెల్యేను కోరాం.

– ప్రకాశరావు, డీఈఈ, ఆర్అండ్‌బీ, తుని

నిబంధనలు అమలు



పట్టణంలో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు చర్యలు చేపట్టాం. గొల్ల అప్పారావు సెంటర్ నుంచి తలుపులమ్మ ఆలయం వరకు సెంటర్ డివైడర్ ఏర్పాటు చేశాం. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటలకు మెయిన్ రోడ్డులోకి వ్యాన్లు, ఆటోలను అనుమతించం. లోడింగ్ ఆటోలకు అనుమతి ఇచ్చాం. మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తోపుడు బండ్ల వ్యాపారులకు అనుమతి ఉంది. ట్రాఫిక్ సమస్యను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాను వినియోగిస్తున్నాం.

– గీతా రామకృష్ణ, సీఐ, తుని

వాటర్ కూలర్ ప్రారంభం



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న కొండలరావు

ప్రత్తిపాడు: వరుపుల రాజా ఫ్రెండ్స్ బృందం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వాటర్ కూలర్‌ను బహూకరించారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల కొండలరావు(నాని) ఈ కూలర్‌ను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌమ్య మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి గంగాలమ్మ జాతర



గోకవరం: గ్రామ దేవత గంగాలమ్మ జాతర ఈ నెల 20 నుంచి జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. 20న గరగలు తీయడం, ప్రత్యేక పూజలు, 21, 22 తేదీల్లో జాతర, 23న అన్న సమారాధన నిర్వహిస్తామని వివరించారు. గ్రామస్తులు ఈ జాతరను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు నాగులకొండ శివరామకృష్ణ, ఏనుగ శ్రీనివాసరావు, చిటికల పాండు, సంగుల చక్రరావు, ఎలుగుబంటి చంటిబాబు కోరారు.

వేసవిలో అపరాలతో లాభాలు

- వ్యవసాయ శాఖ ఏడీ బుల్లిబాబు



కుమ్మరిలోవలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ బుల్లిబాబు

తుని రూరల్: వేసవిలో ఆరుతడిగా సాగయ్యే అపరాలను పండించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు సుంకర బుల్లిబాబు రైతులకు సూచించారు. మంగళవారం ఏఓ బి.అశోక్‌కుమార్‌తో కలసి ఏడీఏ బుల్లిబాబు కుమ్మరిలోవ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా నువ్వు చేలను పరిశీలించి, సస్యరక్షణ చర్యలు, వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ఆరుతడిగా అపరాలను సాగు చేయాలని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఎకరాకు ఎనిమిది నుంచి 12 కిలోల విత్తనాలు చల్లితే, ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల అపరాల దిగుబడులు లభిస్తాయన్నారు. సకాలంలో అపరాలు చల్లితే, ఖరీఫ్ వరినాట్ల సమయానికి ఫలసాయం అందుతుందన్నారు. ఏఈఓ పి.జగ్గఅప్పారావు, వీఏఏ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: గిరిబాబు



భద్రవరంలో పార్టీ శ్రేణులతో ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోరారు. మండలంలోని భద్రవరం గ్రామంలో మంగళవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. పార్టీ అభ్యున్నతికి ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాశపు వీరబాబును ఆయన కలుసుకున్నారు.

అడ్డుకొండ భూమిని పేదలకు పంచాలి



జగ్గంపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల, గండేపల్లి మండలం గోపాలపురం సరిహద్దుల్లో ఉన్న 508 ఎకరాల ప్రభుత్వానికి చెందిన అడ్డుకొండ భూమిని తక్షణం నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంపిణీ చేయాలని కోరుతూ ఏపీ రైతు కూలీ సంఘం ఆందోళన చేపట్టింది. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ల వద్ద సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన, ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జేవీఆర్ రమేష్, ఎస్సై రఘునాథరావుకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, అడ్డకొండ భూమి కోసం ఎన్నో ఏళ్లుగా రైతు కూలీ సంఘం పోరాటం చేస్తోందని తెలిపారు. దీనిని సామర్లకోటకు చెందిన కొందరు భూస్వాములు తమ గుప్పిట్లో పెట్టుకున్నారని ఆరోపించారు. సంఘ న్యాయ పోరాటాల ఫలితంగా అప్పటి జిల్లా కలెక్టర్ దీనిపై కమిటీ వేసి, ఆ నివేదిక మేరకు ఈ భూమిని పేదలకు పంపిణీ చేయాలని ఆదేశించారని గుర్తుచేశారు. అయినా తమపై వస్తున్న ఒత్తిడితో జిల్లా అధికారులు దీనిని అమలు చేయలేదన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న ఈ భూమిలో మామిడి, జీడి మామిడి తోటల నుంచి వచ్చే ఫలసాయాన్ని ప్రభుత్వంలో ఉన్న పలుకుబడిని ఉపయోగించి ఆ భూస్వాములు పట్టుకుపోతున్నారని ఆరోపించారు. తక్షణం వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రామలింగేశ్వరరావు, విద్య, పీడీఎస్‌యూ నేత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం



బలరామపురంలో ఆదర్శ రైతులను సత్కరిస్తున్న సిబ్బంది, గ్రామ పెద్దలు

రౌతులపూడి: మంచి పోషక విలువలు, ప్రోటీన్లు అందించే ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మండల వ్యవసాయ విస్తరణాధికారి సీహెచ్ గోపీనాథ్ అన్నారు. మంగళవారం బలరామపురంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ డి.వరలక్ష్మి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా, కేవలం ప్రకృతి పరమైన ఆవుపేడ, మూత్రం, పచ్చి రొట్ట వంటి వాటితో తయారు చేసే ఎరువులు, క్రిమి సంహారక మందులను వినియోగించాలని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టిన రైతులు కందా నారాయణరావు, పైల నానాజీ, దాసరి రమణను ఆదర్శ రైతులుగా గుర్తించి, సత్కరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైల సీత, ఎంపీటీసీ సభ్యుడు సోమరౌతు రవి, యగదాసు నాగేశ్వరరావు, దాసరి సత్తిబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



ఏలేశ్వరంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ రాజశేఖర్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో ఈ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో కళాశాల ఆవరణలో అధ్యాపకులు ప్రిన్సిపాల్‌కు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, కళాశాలలో అధ్యాపకుల సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. దీంతో పాటు కళాశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించినట్టు చెప్పారు. కళాశాల తరగతి గదుల్లో సీసీ కెమెరాలు, స్పీకర్లు, డిజిటల్ బోర్డులు తదితర సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.బాబ్జీ, అధ్యాపకులు పలివెల శివాజీ, అనిల్, వాగు మాధవ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పఖ్వాడా



అవగాహన కల్పిస్తున్న ఫార్మసీ విద్యార్థులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పెద్దాపురం మండలం గోరింటలో పోషణ్ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ కె.రవి శంకర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులు, చిన్నారుల తల్లులకు పోషకాహార విలువలపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ పి.ప్రశాంతి, ఎస్.శృతి, వలంటీర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, కార్యకర్త వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీఎండీఎస్‌పై అవగాహన



వెదురుపాకలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గోకవరం: వెదురుపాక గ్రామంలో పీఎండీఎస్ (నవధాన్యాలు విత్తనాలు) ఉపయోగాలపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులో నవధాన్యాల సాగుపై రైతులకు వివరించారు. అనంతరం రైతులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

గండేపల్లి: వీఏఏ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి స్థానిక వ్యవసాయ కార్యాలయంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జె.ఇలియాజర్, ఏఓ సద్గురుమూర్తి మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) విధానంతో భూమి ఆరోగ్యంగా ఉంటుందని, రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. ఈ విధానం అవలంబించడం వల్ల భూమిలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, నవ ధాన్య పంటల వల్ల పశువులకు పోషక విలువలతో కూడిన పచ్చి మేత లభిస్తుందని వివరించారు. నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెంది, నీటి నిల్వ పెరుగుతుందని విశ్లేషించారు. నేల కోతకు గురికాకుండా ప్రధాన పంట దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ చంద్రమౌళి, వీహెచ్ఏలు, ఎన్ఎఫ్ఏ నాయుడు, ఎంటీ భాస్కరరావు, రమ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన దోషులను శిక్షించాలి



ఏలేశ్వరంలో రోడ్డుపై బైఠాయించిన దళితులు



గిడజాంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రౌతులపూడి: శంఖవరంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానపరిచిన దోషులను శిక్షించాలంటూ మంగళవారం మండలంలోని గిడజాంలో ప్రజలు నిరసన చేశారు. ఆర్అండ్‌బీ రహదారిపై కొంతసేపు రాస్తారోకో నిర్వహించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడిని ఇంత దారుణంగా అవమానించడాన్ని ఆందోళనకారులు తప్పుబట్టారు. ఈ చర్య అణగారిన వర్గాలను కించపర్చడమేనని ఆక్షేపించారు. దోషులు ఎంతటి వారైనా పట్టుకోవాలని, సీసీ ఫుటేజీలు బయటపెట్టి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

దళితుల ఆందోళన

ఏలేశ్వరం: శంఖవరంలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించడంపై పట్టణంలో దళితులు ఆందోళన నిర్వహించారు. దళిత నాయకుడు కుప్పల నాగభూషణం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

దురదృష్టకరం

ప్రత్తిపాడు: శంఖవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించడం దురదృష్టకరమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఒక ప్రకటనలో ఖండించారు. దుండగులను గుర్తించి, శిక్షించాలని ఆమె పోలీసులను కోరారు. ప్రజలంతా సంయమనం పాటించాలని సూచించారు. ఈ సంఘటనను పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను మరో ప్రకటనలో ఖండించారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు



పాత కోడాడలో పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

తొండంగి: పాడైన మంచినీటి పైపులైన్‌కు అధికారులు మంగళవారం మరమ్మతులు చేయించారు. తొండంగి మండలం పాత కోడాడ గ్రామంలో మంచినీటి సరఫరా చేసే పైపులు మరమ్మతులకు గురయ్యాయి. సమాచారం అందుకున్న ఎంపీడీఓ బి.రాజేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీఓ మార్కండేశ్వరరావు శిథిలమైన పైపులైన్‌ను పరిశీలించారు. స్వీయ పర్యవేక్షణలో పైపులకు మరమ్మతులు చేయించారు. వేసవి ముగిసే వరకూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి జగ్గారావును ఆదేశించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రక్షిత తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

ఆర్థిక సంఘ సమావేశానికి ఎంపీపీ ఎంపిక



గోళ్ల కాంతిసుధాకర్

ప్రత్తిపాడు: తిరుపతిలో ఈ నెల 17న జరగనున్న 16వ ఆర్థిక సంఘ నిధుల వినియోగంపై రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ఎంపికయ్యారు. ఇందులో పాల్గొనాలని రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ మంగళవారం లేఖ పంపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఐదుగురు ఎంపీపీలు ఎంపిక కాగా, సుధాకర్ వీరిలో సుధాకర్ ఒకరు. అలాగే ఇందులో పాల్గొనేందుకు రాష్ట్రంలోని తొమ్మిది మంది సర్పంచ్‌లను కూడా ఎంపిక చేశారు.

హేమజ్యోతికి షైనింగ్ స్టార్ అవార్డు



లాప్‌టాప్ అందుకుంటున్న హేమజ్యోతి

తుని రూరల్: తుని మండలం హంసవరంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ ఎంఈసీలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని గింజాల హేమజ్యోతి (టి.వెంకటాపురం) షైనింగ్ స్టార్స్ జాబితాలో చోటు దక్కించుకుంది. మంగళవారం ఉండవల్లిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నుంచి ఆమె ల్యాప్‌టాప్ అందుకుంది. దృష్టిలోపం ఉన్నప్పటికీ ప్రిన్సిపాల్ పుల్లా పద్మజ, అధ్యాపకుల ప్రోత్సాహంతో ఉత్తమ ఫలితం సాధించినట్టు విద్యార్థిని హేమజ్యోతి తెలిపింది.

క్రీడా మైదానం కాదండోయ్..

కిర్లంపూడి: ఈ చిత్రంలో కనిపిస్తోంది క్రీడా మైదానం అనుకుంటే మీరు పొరబడినట్టే. జగపతినగరం పంచాయిత కిర్లంపూడి ఏనుగువీధి సెంటర్‌లో ఉన్న మంచినీటి చెరువు ఇలా తయారైంది. చెరువు నిర్వహణకు నోచుకోకపోవడంతో గట్టుపై నుంచి వేస్తున్న చెత్తాచెదారంతో అస్తవ్యస్తంగా మారింది. అప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఉపాధి హామీ పనుల ద్వారా చెరువులోని గడ్డిని, గట్టు అంచున పేరుకున్న చెత్తచెదారాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కిర్లంపూడి ఏనుగువీధి సెంటర్‌లోని మంచినీటి చెరువు

గో ఆధారిత వ్యవసాయం మేలు



డి.పోలవరంలో భూమి, గోపూజ నిర్వహిస్తున్న సమితి ప్రతినిధులు

తుని రూరల్: సాగులో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం మేలని ఆంధ్ర ప్రాంత గ్రామ వికాస ప్రముఖ్ తిరుపతయ్య అన్నారు. మంగళవారం తుని మండలం డి.పోలవరంలో భూమి సుపోషణ కార్యక్రమాన్ని గ్రామ వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథి తిరుపతయ్య మాట్లాడుతూ, గో ఆధారిత వ్యవసాయం వల్ల భూమి ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉంటుందన్నారు. తద్వార లభించే ఆహారం ఆరోగ్యవంతంగా ఉంటుందని చెప్పారు. అంతర పంటలు, పంట మార్పిడి విధానాలతో తెగుళ్ల బెడద తగ్గి రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు.